క్లుప్తంగా

యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎస్‌వీసీటీ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక వజ్రమ్మ చారటబుల్ ట్రస్టు (ఎస్‌వీసీటీ) ఆధ్వర్యంలో 55 మంది అనాథ విద్యార్థులు ఒక్కొక్కరికి రెండు జతల (యూనిఫాం) దుస్తులను పంపిణీ చేశారు. స్థానిక చిన్మయ సుగుణం చిత్రివీధి కేంద్రం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుస్తులను అందించారు. ఈ సందర్భంగా ఎస్‌వీసీటీ ప్రతినిధి టంకాల అర్జున్, పీఆర్వో సదాశివుని కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదువుతున్న తల్లి, తండ్రి, ఇద్దరూ లేని విద్యార్థులు 55 మందిని ఎంపిక చేసి దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. వారికి అన్ని సదుపాయాలు వారధి ప్రోగ్రాం ద్వారా కల్పిస్తున్నామన్నారు. అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా ఆయా స్కూళ్ల యూనిఫాం ప్రత్యేకంగా కుట్టించి రెండేసి జతలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు, విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతీఫ్రెడరిక్, వార్డు సభ్యులు బి.ఎల్.శర్మ, ఎస్‌వీసీటీ సిబ్బంది రమేష్, రామారావు, కరుణ, కాంతారావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాన్ని పునర్ నిర్మాణం చేపట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ కార్యాలయం భవనాన్ని కూటమి నాయకులు కూల్చివేసి అన్న క్యాంటీన్ నిర్మాణం చేపడుతున్నారని, దీనికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల అవసరాలకు ఎంతో ఉపయోగపడే పంచాయతీ భవనాన్ని చట్ట విరుద్ధంగా కూల్చివేశారన్నారు. అన్న క్యాంటీన్ వేరో చోట కట్టాలన్నారు. పంచాయతీ భవనం కూల్చివేసిన స్థలంలోనే పునర్ నిర్మాణం చేపట్టాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఓం శాంతి నిలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పాతపట్నం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ఓం శాంతి బీకే నీరజ అన్నారు. సోమవారం పాతపట్నం మండల కేంద్రంలోని మార్కెట్ వద్ద ఓం శాంతి నిలయంలో విద్యార్థులకు ఉచితంగా యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యోగా గురువులు నరేంద్ర, రమేష్, కోటి పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాయడం తగదు



మాట్లాడుతున్న సిర్ల ప్రసాదరావు

కొత్తూరు: కార్మికులు, ఉద్యోగుల హక్కులను కాలరాసే పని గంటల పెంపు సవరణ బిల్లును కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకుడు పనస రమేష్, ప్రజా సంఘాల నాయకుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. పని దినాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ.. బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించిన 8 గంటలను 10 గంటలకు సీఎం చంద్రబాబు పెంచడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. పని గంటల పెంపు సవరణ బిల్లును ఉపసంహరించుకోకపోతే ఉద్యమబాట తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేటినుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

హిరమండలం: ఆధార్‌లో చేర్పులు, మార్పులు, అప్‌డేషన్‌కు సంబంధించి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 26 వరకు గొట్టా అంగన్‌వాడీ కేంద్రంలో, 24 నుంచి 27 వరకు పిండ్రువాడ సచివాలయంలో ఈ శిబిరాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోమల దండయాత్ర..!



సరుబుజ్జిలి సచివాలయంలో మూలకుచేరిన ఫాగింగ్ యంత్రం

- పలుచోట్ల మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు
- ప్రబలుతున్న అంటువ్యాధులు
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

సరుబుజ్జిలి: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ఎక్కడికక్కడే చెత్త, మురికి పేరుకుపోయింది. వ్యర్థాలను నెలల తరబడి శుభ్రం చేయకపోవడం వలన దుర్గంధం వెదజల్లుతోంది. మురికి గుంతల్లో నిల్వ ఉన్న నీటిపై దోమలు చేరుతున్నాయి. దీంతో గ్రామాల్లో పలు రకాల అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. నియోజకవర్గంలోని 4 మండలాల్లో గల 110 పంచాయతీలకు 76 ఫాగింగ్ యంత్రాలు పంపిణీ చేశారు.

నిరుపయోగం..

దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు ద్వారా రసాయన పదార్థాలను స్ప్రే చేయాలి. వాటిని గతంలో సచివాలయాలకు అందించారు. ఈ యంత్రాలను వినియోగించి ఫాగింగ్ చేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శి తీసుకోవాలి. వీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడం వలన అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఆమదాలవలస మండలంలో ఒక్క ఫాగింగ్ యంత్రం కూడా వినియోగించి దోమల నివారణ చేసిన దాఖలాలు లేవు. దీనివలన గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. పొందూరు మండలంలో కొన్ని గ్రామల్లో అంతంత మాత్రంగా ఫాగింగ్ చేసిన తరువాత యంత్రాలు మూలకు చేరాయి.



ప్రబలుతున్న అంటువ్యాధులు..

సాయంత్రం అయ్యేసరికి దోమల మోత అధికంగా ఉండం వలన ప్రజలు భయపడుతున్నారు. ఇళ్ల ముందు ఉన్న మురుగు కాలువలు, గుంతల్లోకి చేరుతున్నాయి. దోమలు కుట్టడం వలన తరచూ జ్వరాలు వస్తున్నాయి. డయేరియా, వంటినొప్పులతో బాధపడుతున్నారు.

నిధుల కొరత..

పారిశుధ్య పనులు, దోమల నివారణ, రక్షిత మంచి నీటి పథకాలను శుభ్రం చేయాలంటే పంచాయతీల్లో సరిపడే నిధులు లేకపోవడ వలన పనులు చేసేందుకు ముందుకు రాలేని పరిస్థితులు ఉన్నాయని పలువురు సర్పంచ్‌లు చెబుతున్నారు. ప్రభుత్వం పంచాయతీలకు నిధులను సకాలంలో మంజూరు చేకపోవడం వలన ఇబ్బందులు తప్పడం లేదన్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో పంచాయతీలు, ఫ్యాగింగ్ యంత్రాల వివరాలు..		
మండలం	పంచాయతీలు	ఫాగింగ్ యంత్రాలు
సరుబుజ్జిలి	21	14
ఆమదాలవలస	30	19
పొందూరు	29	27
బూర్జ	30	16

క్షేత్రస్థాయిలో తనిఖీలు లేవు



వర్షాకాలానికి ముందే అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలి. దీని వలన అక్కడి సమస్యలు వారి దృష్టికి వచ్చి త్వరితగతిన పరిష్కారానికి నోచుకొంటాయి. అధికారులు కార్యాలయాలకు పరిమితం అవుతున్నారు.
– ఎస్.నాగేశ్వరరావు, జెడ్పీటీసీ, సరుబుజ్జిలి

దోమల నివారణ చర్యలు తీసుకోవాలి



వర్షాకాలం వచ్చిందంటే దోమల సమస్యలు వెంటాడుతున్నాయి. సాయంత్రం అయ్యేసరికి ఆరుబయట ఉండాలంటే భయమేస్తోంది. దోమల గుంపుగా దాడి చేస్తున్నాయి. దీనివలన బోధకాలు, మలేరియా వ్యాధులు వచ్చే ప్రమాదముంది. ఫాగింగ్ యంత్రాలను మరమ్మతులు చేసి మందులు స్ప్రే చేయాలి.
– పి.వెంకటేష్, మూలసవలాపురం

చర్యలు చేపడతాం

ఫాగింగ్ యంత్రాలు సచివాలయాలకు అందించాం. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకశ్రద్ధ తీసుకొని యంత్రాలతో గ్రామాల్లో రసాయనక మందు స్ప్రే చేయాలి. వెంటనే స్ప్రేయింగ్ జరిగేలా చూస్తాం.
– బి.రామారావు, ఈఓపీఆర్డీ, సరుబుజ్జిలి

ముక్కు మూసుకోవాల్సిందే..



కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్ అధ్వానంగా ఉంది. వర్షం నీరు ఎటూ వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో కాంప్లెక్స్ ఆవరణలోనే నిల్వ ఉండడంతో ఈ దుస్థితి నెలకొంది. కాంప్లెక్స్‌కు ఆనుకొని పండ్ల దుకాణాలు ఉన్నందున ఆ వ్యర్థాలు నిల్వ ఉన్న నీటిలో వేయడంతో దుర్వాసన వస్తోంది. దీంతో కాంప్లెక్స్‌కు వచ్చేవారు ముక్కు మూసుకోవాల్సి పరిస్థితి నెలకొంది. ఆవరణ మొత్తం బురదమయం కావడంతో ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – కొత్తూరు

నిరుపయోగం..



ఈ చిత్రం సారవకోట మండలంలోని కిడిమి పంచాయతీ భద్రాచలం గ్రామానికి సమీపంలో కొండ అంచున పశువులు నీరు తాగేందుకు ఏర్పాటు చేసిన తొట్టి. దీనిని జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి నిధులుతో నిర్మించారు. ఈ తొట్టెను ఎటువంటి నీటి వనరులు లేని చోట నిర్మించడం గమనార్హం. అక్కడ నీటి వనరులే లేకపోతే తొట్టెలో నీరు ఎలా నింపుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. – సారవకోట

ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీ తొలగింపు

- పోరాటాలతో దిగొచ్చిన కేంద్రం
- స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న మేనేజర్, ఏజెంట్ల సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: ఎల్‌ఐసీ ప్రీమియంలపై ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తొలగించిందని, ఇది ఆలిండియా ఏజెంట్లు అసోసియేషన్ పోరాట ఫలితమని నరసన్నపేట బ్రాంచ్ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పాడ శాంతారావు అన్నారు. స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేసి ఏజెంట్లు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ.. గడిచిన 11 ఏళ్లుగా ఎల్‌ఐసీ పాలసీలపై ప్రీమియంలు కట్టేటప్పుడు జీఎస్టీకేంద్రం వసూలు చేస్తుందన్నారు. పాలసీదారులపై జీఎస్టీ భారం ఎంతో పడిందన్నారు. పాలసీదారుల తరఫున పోరాటం చేశామన్నారు. దీనిని ఇప్పుడు సవరించిన విధానాలతో రద్దు చేయడం జరిగిందన్నారు. ఒక్క నరసన్నపేట బ్రాంచ్ పరిధిలోనే ఏటా రూ.4 కోట్లు వరకు పాలసీదారులు ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. బ్రాంచ్ మేనేజరు ఎం.నేతాజీ, డవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాలకు కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ఊరట ఇస్తోందన్నారు. పాలసీ ప్రీమియం మొత్తం ఎంత ఉంటే అంత మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఏజెంట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డెసు, ప్రతినిధులు ఎల్వీ రమణ, పి.చంద్రశేఖర్,, రమణయ్య, మెండ చిన్నవాడు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న యాజమాన్య ప్రతినిధులు, సిబ్బంది

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పట్టణంలో ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలన్నీ సోమవారం బంద్ పాటించాయి. అనంతరం ఆయా కళాశాలల వద్ద కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా యాజమాన్య ప్రతినిధులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. పలుమార్లు ప్రభుత్వానికి తమ బాధలు తెలియజేసినా పట్టించుకోలేదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళనకు సిద్ధపడ్డామని జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు అన్నారు. 7 విడతల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. కళాశాలలు నిర్వహించలేకపోతున్నామని, ఆర్థిక ఇబ్బందులతో అధ్యాపకులకు వేతనాలు చెల్లించలేక పోతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు మరింతగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పద్మావతి, డీఆర్‌ఎస్, ఎల్‌వీఆర్, ప్రిజం డిగ్రీ కళాశాలల వద్ద ఆయా యాజమాన్య ప్రతినిధులు ధర్నాలు చేపట్టారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

పాతపట్నం: గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.కరుణాకరరావు అన్నారు. స్థానిక ఉప్పరవీధిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని పశువైద్యులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఆరు నెలల పైబడిన ప్రతీ పశువుకు ఈ టీకాలు వేయించాలని, చూడి ఉన్న పశువులకు కూడా ఈ టీకాలు వేయవచ్చన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు.

నేడు ఉపకరణాల గుర్తింపు శిబిరం

పాతపట్నం: ఈ నెల 23వ తేదీన పాతపట్నం ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలోని ఎంపీపీఎస్ ఆవరణలో ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంఈఓ ఎ.గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ప్రత్యేకావసరాల విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీల్‌చైర్, రోలేటర్, ట్రైసైకిల్, చెవిటి మిషన్ల కోసం ఎంపిక చేస్తారన్నారు. 6 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు గల ప్రత్యేకావసరాల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు.

25న ప్రత్యేకావసరాల విద్యార్థుల గుర్తింపు శిబిరం

ఆమదాలవలస: ఈ నెల 25న అర్హులైన ప్రత్యేకావసరాల గల విద్యార్థులకు ఉపకరణాలను అందజేసేందుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఎంఈఓలు కె.అప్పలరాములు, టింగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమదాలవలస గేటు మున్సిపల్ హైస్కూల్ వద్దకు ఉదయం పది గంటలకు చేరుకోవాలన్నారు. ఆమదాలవలస మండల, మున్సిపాలిటీ, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న 6 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు గల విద్యార్థులు అర్హులన్నారు. వీల్‌చైర్, ట్రైసైకిల్, బీటీఈ, రోలేటర్, సీపీ చైర్, తదితర వస్తువులు అందించేందుకు గుర్తింపు ప్రక్రియ ఉంటుందన్నారు. విద్యార్థి ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, విద్యార్థి ఫొటోను తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 94925 34253, 94919 31596లను సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న గండివలస ఆనందరావు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు అన్నారు. కొత్తూరులో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అనుబంధ శాఖలకు సంబంధించి మండలంలో నియామకాలు పూర్తయ్యాయన్నారు. పేద ప్రజలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో పేదలకు వైద్య సేవలు నిలిచిపోయాయన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కొంత మంది రైతులకు మాత్రమే జమైందన్నారు. యూరియాను టీడీపీ నాయకులు కృత్రిమ కొరత సృష్టించారని, ఈ విషయాన్ని రైతులుకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గుడబండి పోలయ్య, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అగతమూడి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, సర్పంచ్ యర్లంకి ధర్మారావు, అగతమూడి రంజిత్, ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి దూలి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విశ్వకర్మ జయంత్యుత్సవాలు



విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

నరసన్నపేట: విశ్వకర్మ జయంత్యుత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్థానిక బండివీధిలో స్వర్ణకార సంక్షేమ సంఘం, తెలగవీధిలో విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జయంత్యుత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించారు. విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. స్వర్ణకారులు, విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పైల చంద్రమ్మ వర్ధంతి సభకు తరలిరండి



సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజనుల

మెళియాపుట్టి: ఈ నెల 25వ తేదీన పలాస-కాశీబుగ్గలోని టీకేఆర్ కార్యాలయంలో కామ్రేడ్ పైల చంద్రమ్మ వర్ధంతిని సభ నిర్వహించనున్నట్లు అరుణోదయ జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని హడ్డివాడ గిరిజన గ్రామంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. సోమేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శిగా ఆరు దశాబ్దాలపాటు అలుపెరుగని ఉద్యమాలు చేశారని కొనియాడారు. ఆమె వర్ధంతి సభకు గిరిజనులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. మెళియాపుట్టి మండలంలో ఐటీడీఏ ఏర్పాటు కోసం పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

జగన్మాతా నమోస్తుతే..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండపాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయాల్లోనూ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. తొలిరోజు దుర్గాదేవి వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమ, అఖండ దీపారాధన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: కారు స్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన దేవీ విగ్రహానికి పూజలు చేస్తున్న భవానీలు



నరసన్నపేట: ఉర్లాం మార్కెట్ కూడలిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలు చేస్తున్న కమిటీ ప్రతినిధులు



హిరమండలం: ఎల్.ఎన్.పేట శ్యామలాపురంలో ఏర్పాటు చేసిన దేవీ విగ్రహం



హిరమండలం: సుభలయిలో దేవీ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: అవలింగి నీలమణి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హిరమండలం: పెద్దకోరాడలో బాలాత్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చిన నీలామణి దుర్గ అమ్మవారు



నరసన్నపేట: సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నందవ గ్రామానికి చెందిన సవర చిన్నలక్ష్మయ్య అనే వ్యక్తి ఇంటి మట్టిగోడ ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. ఆ కుటుంబానికి సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం నిత్యావసర వస్తువులు, బియ్యం అందించారు. సహాయం అందించినవారిలో వార్డు సభ్యుడు సవర నరేష్, కార్యకర్తలు గోపాల్, కొండయ్య, రామారావు, చంటి, తదితరులు పాల్గొన్నారు.